రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.34 (బుధవారం సాయంత్రం)

సహర్ : 4.53 (గురువారం ఉదయం)

నిత్యావసర సరుకులు నిలువ ఉంచకుండా సమయానికి మార్కెట్‌కు తరలించి విక్రయించేవాడు దైవానుగ్రహానికి పాత్రుడవుతాడు.



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

మహిళా సంఘాలకు విరివిగా ధాన్యం కొనుగోలు కేంద్రాల కేటాయింపు

● ఆర్థిక పరిపుష్టిని సాధించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పిలుపు

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు విరివిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో 670 కొనుగోలు కేంద్రాలకు గాను వాటిలో మహిళా సంఘాలకు కనీసం 200 పైచిలుకు కేంద్రాలను కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం మహిళా సంఘ ప్రతినిధులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొని ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై మహిళా సంఘాలకు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతను, ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటిన్‌లను, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు వంటి సుమారు 14 రకాల పనులను ప్రభుత్వం మహిళలకు కేటాయిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తుంద న్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణం గానే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణ ద్వారా జిల్లాలో మహిళా సంఘాలు మరింత ఆర్థిక ప్రగతిని సాధించాలనే ఆకాంక్షతో సాధ్యమైనంత మేరకు ఎక్కువ సంఖ్యలో కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత సీజన్‌లో ఐకేపీ మహిళా సంఘాల ద్వారా జిల్లాలో కేవలం 50 కేంద్రాలు మాత్రమే నిర్వహించబడ్డాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే 110 కేంద్రాల నిర్వాహణ కోసం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లను గుర్తించామని వీటి సంఖ్యను కనీసం 200లకు పైగా పెంచామని తద్వారా మహిళా సంఘాలు కొనుగోలు కేంద్రాల నిర్వాహణ ద్వారా కమీషన్ రూపేనా సుమారు 5కోట్ల వరకు లాభాలు ఆర్జించగలుగుతాయని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా స్వయం సహాయక సం ఘాలకు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలను ఇతర అవసరాలకు బదలాయించకుండా వ్యాపార లావాదేవీలు నిర్వహించి ఆర్థిక సాధికారత దిశగా ముందుకెళ్లాలన్నారు.

సంఘాలకు ప్రభుత్వ మద్దతు..

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించే మహిళా సంఘాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు అందిస్తుందన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి లారీల విషయంలో, హమాలీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 110 ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని నిర్ణయించామని ఇంకా మహిళా సంఘాలు ఆసక్తి ఉంటే అర్హతనుబట్టి మరిన్ని కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశానికి హాజరైన మహిళా సంఘాల ప్రతినిధులు



ఆర్టీసీ కార్మికులపై పని భారం!

» అదనపు విధులతో తీవ్ర ఇబ్బందులు
» అనారోగ్యానికి గురవుతున్న ఉద్యోగులు
» 2014 నుంచి నూతన నియామకాలు లేవు
» అన్ని విభాగాల్లోనూ వేధిస్తున్న సిబ్బంది కొరత
» నిజామాబాద్ రీజియన్ పరిధిలో 800 పైగా పోస్టులు ఖాళీ

సుభాష్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగులు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తుండటంతో ఉన్న ఉద్యోగులపై భారం పెరుగుతోంది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. గతంలో పనిచేసిన పనిగంటల కంటే అదనంగా విధులు నిర్వహిస్తుండటంతో వారి ఆరోగ్య పరిస్థితులు విషమంగా తయారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు సంఖ్య పెరగడంతో పనిభారం పెరిగిందని వాపోతున్నారు. పది సంవత్సరాలకు పైగా ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులతో సంస్థ నెట్టుకొస్తోంది. రోజురోజుకూ కార్మికుల సంఖ్య తగ్గుతున్నా బస్సులు మాత్రం యధావిధిగా కొనసాగుతున్నాయి. సంస్థ యాజమాన్యం కొన్ని సంవత్సరాలుగా కారుణ్య నియామకాలను మాత్రమే చేపడుతోంది. ఇది తప్ప సంస్థలో ఉద్యోగాలను నియమించిన దాఖలాలు లేవు. రీజినల్ పరిధిలో వివిధ విభాగాల్లో 800 పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం కొన్ని ఉద్యోగాల నోటిఫికేషన్‌ను జారీ చేసినా వాటి అమలు జరగడం లేదు. ప్రభుత్వంలో విలీనం అంటూ ప్రభుత్వాలు ఊదరగొట్టిన అది కూడా ఆచరణలో అమలు కాలేదు. ప్రభుత్వంలో విలీనం అవుతున్నామన్న ఆశతో కొందరు ఉద్యోగులు పనిభారం ఎక్కువైనా ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నామని వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం వీఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించిన సమయంలో కార్మికులు అటు వైపు ఆసక్తి చూపారు. అనంతరం ప్రభుత్వంలో విలీనం అనగానే ఉద్యోగాలవైపు మొగ్గు చూపారు. విలీనం అటకెక్కగానే ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

2014 నుంచి నియామకాలు లేవు..

ఆర్టీసీ యాజమాన్యం నూతన ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. 2014 తర్వాత డ్రైవర్లు, కండక్టర్లతో పాటు వివిధ ఉద్యోగాల్లో ఉద్యోగులను నియమించలేదు. డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, క్లర్క్, అకౌంట్స్ వివిధ విభాగాల్లో ఉద్యోగులను నియామకం చేపట్టలేదు. దీంతో గతంలో నిజామాబాద్ రీజియన్ వ్యాప్తంగా 6 డిపోల్లో సుమారు 3వేలకు పైగా మంది ఉద్యోగులు సంస్థలో పనిచేస్తుండగా ప్రస్తుతం కేవలం 2వేలకు పైగా ఉద్యోగులు మాత్రమే సంస్థలో పనిచేస్తున్నారు. ఇందులో రిటైర్డ్‌మెంట్ అయిన వారు కొందరైతే.. మరికొంత మంది చిన్న చిన్న తప్పులు చేసి పెద్ద ఉద్యోగుల ఆగ్రహానికి గురైన వారు కొందరు ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం డ్రైవర్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసినా ఆచరణలో మాత్రం పెట్టలేదు.

డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది కొరత..

నిజామాబాద్ రీజియన్‌గా ఆరు డిపోల్లో డ్రైవర్ల కొరత వేధిస్తుంది. ఆరు డిపోల్లోని సుమారు 160 మంది పైగా డ్రైవర్లు తక్కువగా ఉన్నారు. వీటి కోసం గత కొన్ని రోజుల క్రితం ప్రైవేటు డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం భావించింది. అది ఇంకా అమలుకు నోచుకోలేదు. ఉన్న డ్రైవర్లతో 8 గంటల పనిచేయాల్సిన వారు సుమారు 12 నుంచి 14 గంటల వరకు పనిచేస్తున్నారు. డ్రైవర్ల కోసం 8 గంటల పని అనంతరం విశ్రాంతి ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి డ్రైవర్లకు లేదు. నిజామాబాద్ రీజియన్ లోని ఆరు డిపోలలో ఇదే పరిస్థితి నెలకొంది. డ్రైవర్లతో పాటు కండక్టర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు తదితర విభాగాల్లో సైతం సిబ్బంది లేరు. ప్రైవేటుగా కొందరిని నియమించుకొని సంస్థ నెట్టుకొస్తుంది.

పనిభారంతో అనారోగ్యం..

ఆర్టీసీ ఉద్యోగులు పనిభారాలతో అనారోగ్యం పాలవుతున్నారు. 8గంటలు చేయాల్సిన పనిని 12 నుంచి 14గంటలు మరికొందరైతే 16 గంటల సమయంలో పనిచేస్తున్నారు. గతంలో 8గంటలు పనిచేస్తే ఆరు రోజులు పనిదినాలుగా పరిగణించేవారు. ఒకరోజు సెలవు ఇచ్చేవారు. అదే విధంగా స్పెషల్ ఆఫ్ డ్యూటీ 12గంటలు పనిచేస్తే మూడు రోజులు పనిచేస్తే సరిపోయేది. ప్రస్తుతం ఇవేమి డ్యూటీలు వేయకుండా 14 నుంచి 16 గంటలు పనిచేస్తున్నారు. ఈ పని ఒత్తిడితో కొందరు అనారోగ్య పాలవుతున్నారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత ప్రయాణికులు ఎక్కువగా కావడంతో కండక్టర్లు, డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పథకం అనంతరం తరచూ డ్రైవర్లు, కండక్టర్లతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగడంతో ఉద్యోగం చేయడం వారికి కత్తిమీద సామే అయింది. జిల్లాలో పనిభారంతో పదుల సంఖ్యలో ఉద్యోగులు మరణించారని ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. పనిభారాన్ని తగ్గించి ఉద్యోగ సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పరంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి..

: సాయిలు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు



ప్రభుత్వ పరంగా ఉద్యోగ నియామకాలు చేపట్టి ఆర్టీసీ కార్మికులపై పని భారాన్ని తగ్గించాలి. ఏజెన్సీల ద్వారా నియామకాలను చేపట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నడిపించాలి. ప్రైవేటు యాజమాన్యానికి ఇవ్వడం వల్ల ఆర్టీసీ నిర్వీర్యం అవుతుంది.

కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలి..

:సంజీవ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆర్టీసీ మాజీ రాష్ట్ర కార్యదర్శి



ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో ఉద్యోగులపై పనిభారం ఎక్కువ అవుతుంది. దీంతో ఉద్యోగులు అనారోగ్యాల పాలవుతున్నారు. కొందరు పనిభారంతో వివిధ కారణాల వల్ల మరణిస్తున్నారు. ఉద్యోగుల నియామకం చేపట్టాలి. అక్రమంగా సర్వీసుల నుంచి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి.



మంత్రి పదవిపై చిగురిస్తున్న ఆశలు

» త్వరలో మంత్రివర్గ విస్తరణపై సంకేతాలు
» జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డికి దక్కనున్న మంత్రి పదవి?
» పార్టీ జిల్లా శ్రేణుల్లో ఉత్సాహం

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో జిల్లాకు మంత్రి పదవిపై ఆశలు చిగురిస్తున్నాయి. వారం రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఏఐసీసీ నుంచి సంకేతాలు వచ్చిన నేపథ్యంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలోనే సీనియర్ నాయకుడైన సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని ఆశించినప్పటికీ వివిధ సమీకరణాల నేపథ్యంలో మంత్రి పదవి దక్కలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు గడుస్తున్నా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవిలేదు. మొదటి నుంచి మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జిల్లాకు వచ్చిన సందర్భంగా పలుమార్లు ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని పార్టీ అధిష్ఠానం వద్ద పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పది మంది మంత్రులు ఉండగా మరో ఆరు ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం మరో నాలుగు మంత్రి పదవులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. వారిలో జుక్కల్ నుంచి లక్ష్మీకాంత్‌రావు, ఎల్లారెడ్డి నుంచి మదన్‌మోహన్, నిజామాబాద్ రూరల్ నుంచి భూపతిరెడ్డిలు మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందగా సీనియర్ నాయకుడైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికే మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి.

గతంలో మంత్రిగా జిల్లాపై తనదైన ముద్ర..

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గతంలో 2009 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా పనిచేసి జిల్లా అభివృద్ధిపై తనదైన ముద్ర వేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన క్యాబినెట్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారు. రాజశేఖరరెడ్డి మరణం అనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లలోనూ ఆయన మంత్రిగా పనిచేశారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమా లను చేపట్టారు.

15 నెలలుగా జిల్లా పాలనపై లేని పట్టు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15నెలలు గడుస్తున్నా జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో పరిపాలనపై పట్టు ఆశించిన మేర కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో పరిపాలన వ్యవహారాలపై నిరంతరం సమీక్షలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. అడపాదడపా అధికారులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయి లో వాటి ప్రభావం కనిపించడం లేదు. ఎమ్మెల్యేగా అధికారులతో సుదర్శ న్‌రెడ్డి సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాని మంత్రి హోదాలో సమీక్షలు నిర్వహిస్తే ఆ ప్రభావం జిల్లాలోని అన్ని శాఖల అధికారులపై ఉంటుంది. గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాటిని క్షేత్రస్థాయిలో ప్రతిభావంతంగా అమలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాకు మంత్రి లేకపోవడం కూడా అధికారులపై ఆజమాయిషీ కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు జిల్లాకు మంత్రి పదవి వస్తుందనే వార్తల నేపథ్యంలో జిల్లా పాలనపై మళ్లీ సుదర్శన్‌రెడ్డి మార్క్ కనిపించే అవకాశాలు కనబడుతున్నాయి.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం..

ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ పనిచేస్తుండగా ఆయన పార్టీ కార్యక్రమాలతో హైదరాబాద్‌లోనే బిజీగా ఉంటున్నారు. దీంతో జిల్లా కాంగ్రెస్‌కు సుదర్శన్‌రెడ్డి పెద్ద దిక్కుగా ఉన్నారు. ఇప్పటికీ జిల్లాకు చెందిన పార్టీ కార్యక్రమం అయినా.. ప్రభుత్వ కార్యక్రమమైనా అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికలను సైతం ఆయనే ఇన్‌చార్జిగా ఉన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సైతం ఏ పని ఉన్నా ఆయన వద్దకే వస్తున్నారు. ఎమ్మెల్యేగా పరిమితం అయిన పరిధిలో ఆయన అందరి పనులను చేస్తున్నప్పటికీ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో మంత్రి పదవి లేదనే లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు ప్రాతినిధ్యం దక్కనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనబడుతోంది.



చక్రస్నానం చేయిస్తున్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి చక్రస్నానం

మోపాల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు ఆరో రోజు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. విశేష చక్రస్నానంతో పాటు స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గరుడ, ధ్వజ ఆరోహణతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ధర్మకర్తలు నిర్మాత దిల్‌రాజు, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, నర్సారెడ్డి, నరాల సుధాకర్‌లు తెలిపారు. ముగింపు ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బోధన్ రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఇసుక తరలిస్తున్న వాహనాలు

ఇసుక అక్రమార్కులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

» బోధన్ కేంద్రం వైపు ప్రత్యేక దృష్టి సారించిన నూతన సీపీ
» మంజీర సరిహద్దు గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణాపై పకడ్బందీ చర్యలు
» వాహన డ్రైవర్లపై కేసులు



మందర్నా వద్ద జేసీబీతో ఇసుక తోడుతున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమార్కులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. పోలీసు కమిషనర్ సాయి చైతన్య బాధ్యతలు స్వీకరించిన అనంతరం బోధన్ కేంద్రం వైపు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మంజీర సరిహద్దు గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణాపై పకడ్బందీ చర్యలు చేపట్టారు. రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని టాస్క్‌ఫోర్స్ పోలీసులచే దాడులు చేయిస్తున్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి మంజీర సరిహద్దు గ్రామాలు మందర్నా తదితర గ్రామాల నుంచి ఇసుక తరలిస్తున్న 89 టిప్పర్లను, మూడు ట్రాక్టర్లను, మూడు జేసీబీలను అదుపులోకి తీసుకున్నారు. 12మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బోధన్, సాలూర మండలం, రెంజల్, కోటగిరి, పొతంగల్ తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. జేసీబీలతో టిప్పర్లను ఇసుక నింపుతుండడంతో పకడ్బందీగా పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో సీపీ సాయి చైతన్య బోధన్ వైపు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇసుక అక్రమ రవాణా పట్ల కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీపీ ఆదేశాల మేరకే దాడులు నిర్వహిస్తామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

● రూ.లక్షా 12 వందల స్వాధీనం

బోధన్‌రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని పంట పొలాల్లో పేకాట స్థావరాలపై సోమవారం అర్ధరాత్రి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. సీఐ అంజయ్య ఆధ్వర్యంలో ఎస్సై గోవింద్, సిబ్బంది పంట పొలాల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి లక్షా 1250 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ


అమ్దాపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్, బెల్లాల్ జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పిలిపించి వారి చదువు సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంతో పాటు పలు గ్రామాల్లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయపడవద్దని ఇష్టపడి పరీక్షలు రాయాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా ఉపాధ్యాయులు పకడ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.

వేల్పూర్‌లో ఈజీఎస్ సామాజిక తనిఖీపై ప్రజా వేదిక



వేల్పూర్‌లో ఈజీఎస్ ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్

వేల్పూర్, మార్చి25(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఈజీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం 16వ విడత సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈప్రజావేదికకు ఎంపీడీవో బాలకిషన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3కోట్ల 50లక్షలకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఆ యన తెలిపారు. ప్రజావేదికలో గ్రామాల వారీగా నిర్వహించిన సా మాజిక తనిఖీలో అడిట్స్ చేసిన సభ్యులు నిష్పక్షపాతంగా రిపో ర్టును చదివి వినిపించారు. మొక్కల పెంపకం బాగున్నప్పటికీ చని పోయిన మొక్కల స్థానంలో వెంటనే మొక్కలు నాటించాలని ఆదే శించారు. కూలీలకు అకౌంట్‌నెంబర్ తప్పు ఉండడం వల్ల అగిపో యిన కూలీల డబ్బులను వచ్చేటట్టు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ, ఎంపీడీవో బాలకిషన్, ఏపీవో అశోక్, ఎస్ఆర్‌పీ సుశీల, బీఆర్‌పీలు,వీఎస్‌లు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, కూలీలు పాల్గొన్నారు.

సాటాపూర్ తైబజార్ వేలం


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

రెంజల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ ఆధ్వర్యంలో తైబజార్ వేలంపాట నిర్వహించారు. 8 లక్షలతో ప్రారంభమైన తైబజార్ వేలం 9.43లక్షల రూపాయలతో నిలిచింది. నీలా గ్రామానికి చెందిన మొహిన్ తైబజార్‌ను కైవసం చేసుకున్నారు. దీంతో వేలంపాట పూర్తయినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకటించారు. వేలంపాటలో వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పోతంగల్‌లో వారాంతపు సంత వేలం

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వారాంతపు, మేకల సంతకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. మేకల సంతకు భారీగా ధర పలికింది. 6.55లక్షల రూపాయలకు ఎల్లారెడ్డికి చెందిన హుస్సేన్ వేలంపాటలో మేకల సంతను దక్కించుకున్నారు.రోజువారి సంత,వారాంతపు సంతకు కనీస ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

● కోటగిరి సంత వేలంపాట

కోటగిరి మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారంతపు సంతకు మంగళవారం అధికారులు వేలంపాట నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటలో 4.58లక్షల రూపాయలకు పోతంగల్‌కు చెందిన గంగారాం అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా

ఆర్మూర్‌టౌన్:మున్సిపల్ పరిధిలో చేపట్టిన తైబజార్ వేలం పాట వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. తైబజార్ వేలం పాటలో ఇద్దరు పాల్గొనగా ప్రభుత్వరేటు అయిన రూ.29 లక్షల 63వేల 740లు ఉండగా ఎవరు వేలం పాటను పాడక పోవడంతో వేలం వేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. నేడు ఉదయం 11గంటలకు వేలం పాటను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

ముప్కాల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని శుక్రవారందేవి ఆలయంలో అదనపు గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు, మండలంలోని వేంపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.3లక్షల 50వేలు మంజూరయ్యారు. ఈ సందర్భంగా మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను బీజేపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, మ్యాక నర్సయ్యసాగర్,గోపినాథ్, విక్రంగైని శ్రీనివాస్, గంగాధర్, పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ ఇవ్వాలి

● మోర్తాడ్ పీఏసీఎస్ మహాజన సభలో సభ్యుల తీర్మానం

మోర్తాడ్, మార్చి25(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రయించిన రైతులందరికి రూ.500బోనస్ ఇవ్వాలని మోర్తాడ్ పీసీఎస్ మహాజన సభలో సభ్యులు తీర్మాణం చేశారు. మంగళవారం మండలంలోని పీఏసీఎస్ ఆవరణలో చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ జరిగింది. రైతు భరోసా, ఐదు ఎకరాల పైన ఉన్న వారికి కూడా ఇవ్వాలని తీర్మాణం చేశారు. అనంతరం సంఘ అర్థ సంవత్సరం జమ ఖర్చులను సంఘ కార్యదర్శి కాశీరాం సభ్యులకు చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంఘ సభ్యులు మహిపాల్, ఏలాల భూమారెడ్డి, ముత్యాల లక్ష్మణ్, కుంట అశోక్‌రెడ్డి, సత్తెమ్మ, భూమేశ్వర్, ఎంఎంసీ డైరెక్టర్ నవీద్, ఏలాల భూమారెడ్డి, సంఘ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిపై కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గౌతమి ఆసుపత్రిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నందిపేట మండలం శాపూర్ గ్రామానికి చెందిన మార్వడి మన్వితకు ఆపరేషన్ నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గుండెపోటు వచ్చి మహిళ చనిపోవడం జరిగిందన్నారు.ఆమె భర్తసురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఆయన తెలిపారు.


మోస్రాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం


బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశావర్కర్లు

ఆశా కార్యకర్తలపై దాడి అమానుషం

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆశా వర్కర్ల అరెస్టులను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్లకు నెలవారి వేతనం 18వేల రూపాయలు అమలు చేస్తామని వాగ్దానం చేసి మాట తప్పుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. కాలయాపన చేయకుండా ఆశా వర్కర్లకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏశాల గంగాధర్, ఆశా వర్కర్లు విజయ, సుజాత, అనిత, బాలహంస, యస్మిన్, జాకీరా తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: హైదరాబాద్‌లో ఆశా కార్యకర్తలపై జరిగిన దాడిని, అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం మోస్రా మండల కేంద్రంలో బస్టాండ్ ఎదుట నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి హైదరాబాద్‌లోని కోఠిలో గల వైద్య ఆరోగ్య కమిషనర్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేపడితే ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపి ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలను నిర్దాక్షిణ్యంగా దాడి చేసి ఈడ్చుకెళ్తూ అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళా ఉద్యోగుల పట్ల చిన్న చూపు తగదని మండిపడ్డారు. ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే శాసనసభలో చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వాలపై పోరు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ, యూనియన్ నాయకురాలు రాణి, భాగ్యలక్ష్మి, గంగా, సరోజ, లక్ష్మి, రూప, ఉమా, శ్యామల, సాత్విక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోంది

● సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, ముప్పా గంగారెడ్డి, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్‌లు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లు అసోసియేషన్ భవన్‌లో ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ప్రవేశపెట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రైతు భరోసా, రైతు రుణమాఫీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉద్యోగాల నియామకాలను గ్రామగ్రామానికి వచ్చే నెల 3వ తేది నుంచి పాదయాత్రగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. బీజేపీ జూటామాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. గత 10సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నార వి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, శరత్ రెడ్డి, దాము, శ్రీకాంత్ గౌడ్, హరికాంత్ చారి, సంగ్రామ్, బ్యాటరీ బాబా, సాయిబాబా, గుండేటి శంకర్, హన్మంత్ రావు, సంగ్రామ్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో మాట్లాడుతున్న సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్

మైక్ తొలగించడం సరికాదు


భీమ్‌గల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న కాలనీవాసులు

భీమ్‌గల్ మార్చి25(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని 10వార్డులో ఏర్పాటు చేసుకున్న స్పీకింగ్ క్లాక్(మైక్)ను విద్యుత్ అధికారులు తొలగించడం సరికాదని కోరుతూ కాలనీవాసులు మంగళవారం ఏఈ కార్యాలయానికి తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ గంటకు ఒకసారి సమయాన్ని సూచించే స్పీకింగ్ క్లాక్ (మైక్) ఏర్పాటు చేసుకున్నామని, కానీ విద్యుత్ అధికారులు తొలగించారని ఈ విషయమై కాలనీవాసులు అందరు ఏఈ కార్యాలయానికి వచ్చి అడగగా పోలీసులు తొలగించమని ఆదేశాలు చేసినట్టు వారు తెలిపారు. ఇదే కాలనీలో ఒక వ్యక్తి ఆర్కెస్ట్రా, పాటలు పెడుతూ కాలనీవాసులకు అటంకం కలిగిస్తున్నాడని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించకోలేదని తెలిపారు. ఈ విషయమై సీపీకి ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జక్రాన్ పల్లి,మార్చి25(ఆంధ్రజ్యోతి): సీఎంరేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లా లని కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమయ్యారు.మంగళవారం జక్రాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావే శమయ్యారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు ఏలా తీసుకువెళ్ళాలని, ఏలా వివరించాలి అనే దానిపై కాంగ్రెస్ నాయకులు సమావేశమై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నిజామాబాద్‌రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలయ్య, శంకర్, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

నవీపేట,మార్చి25(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నవీపేటకు చెందిన విజయ్‌కుమార్ పట్టుబడగా అతనికి స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్ఐ వినయ్ తెలిపారు. అదే రోజున మరో నలుగురు మద్యం సేవించి వాహనాలు నడపగా వారిలో ఒక్కొక్కరికి న్యాయమూర్తి 2వేల రూపాయల చొప్పున జరిమాన విధించారని ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ పేర్కొన్నారు.

బోధన్‌లో మహిళ అదృశ్యం

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని ద్యాకంగల్లీకిచెందిన గాండ్ల లక్ష్మి అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.అదృశ్యమైన మహిళకు మతిస్థిమితం సరిగాఉండదన్నారు.గత మూడుసంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా ఉంటుందన్నారు.ఎవరైనా ఈమె కనిపిస్తే బోధన్‌పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి అన్నికోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

మోర్తాడ్‌లో..

మోర్తాడ్:మండల కేంద్రంలోని తక్కురి వాడలో నివసి స్తున్న మూడలలిత అదృశ్యమైందని ఎస్సైవిక్రం తెలి పారు. రుద్రూర్ మండలం అంబాపూర్ గ్రామానికి చెందిన మూడ లలిత(40)భార్యభర్తలు మోర్తాడ్‌లో కూలిచేసుకొని జీవనం సాగిం చేవారని ఎస్సై తెలిపారు.ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలే దని భర్తమూడ గిర్మయ్య ఫిర్యాదు చేశారని తెలిపారు.భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

ఆర్మూర్‌టౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీ లో నిజాంసాగర్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి(40) శవం లభ్యమై నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతుని ఒంటిపై నలుపు రంగు టీషర్టు, సిమెంట్ రంగు నైట్ ప్యాంటు కలదని, మృతుని ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

అసెంబ్లీలో బాల్కొండ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ఆర్మూర్‌రూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంగళవారం ఆర్ అండ్‌బీ, టూరిజం, ఎండోమెంట్, క్రీడా శాఖల పద్దులపై చర్చ సందర్భంగా బాల్కొండ నియోజక వర్గానికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువెళ్లారు.ఉత్తర తెలంగాణలో, బాల్కొండ నియోజకవర్గం నుంచి నిరుద్యోగయువత ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు అధిక సంఖ్యలో వెళ్తుంటారని అక్కడ కూలీగా పని చేస్తూ చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్నారన్నారు. నైపుణ్యంలో శిక్షణ పొం ది గల్ఫ్‌కువెళ్తే వారి బతుకులు బాగుపడుతాయన్న ఉద్దేశంతో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి మోర్తాడ్‌లో రూ.5కోట్లతో న్యాక్ సెంటర్ నిర్మాణానికి గతంలో నిధులు మంజూరు చేశామని, టెండర్ కూడా పూర్తయ్యిందని, అట్టి పనిని రద్దు చేశారని, దానిని కొనసాగించి పనులు మొదలయ్యేలా చూడాలని ఎమ్మెల్యే వే ముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఎస్సారెస్పీ బ్యాక్ షోర్‌లో టూరిజం స్పాట్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయంలో ప్రతిపాదన చేసి ఇరిగేషన్ ల్యాండ్‌ను టూరిజం వారికి బదిలి చేశామని ఆ ప్రతిపాదన ప్రభు త్వం వద్ద పెండింగ్‌లో ఉందని మంత్రి జూపల్లికి విన్నవించారు. వెంటనే ఆప్రతిపాదనను మంజూరు చేసిఎస్సారెస్పీ బ్యాక్ షోర్‌ను టూరిజాం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా ఎస్సారెస్పీ నుంచి బాసర వరకు టూరిజం అభివృద్ధి చేసేలా బోటు సౌకర్యం కల్పించాలన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 52ఆలయాలు నిర్మించామని,35దేవాలయా లు మంజూరై వివిధ దశల్లో ఉన్నాయని, ఎనిమిది ఆలయాల్లో పనులు జరుగుతూ బిల్లులురాక నిలిచిపోయాయని, టెండర్ అయిఅగ్రిమెంట్‌లు కానీ తొమ్మిది దేవాలయాలు ఉన్నాయని, మంజూరై టెండర్ పిలువాల్సిన దేవాల యాలు 17ఉన్నాయని, వీటన్నింటిని క్లీయర్‌చేయాలని కోరారు. కమ్మర్ పల్లిలో మినీస్టేడియం నిర్మించామని,కంపౌండ్‌వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేప్రశాంత్‌రెడ్డి సంబంధిత మంత్రులను కోరారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

జక్రాన్‌పల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే పర్మి నెంట్ చేయాలని యూనియన రాష్ట్ర అధ్యక్షుడు దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జక్రాన్‌పల్లిలో జిల్లా నాయకుడు భానుచందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో డిచ్‌పల్లిలో మండలంలోని గన్‌పూర్‌లో జరిగే విలీన సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలు దేశ అభివృద్ధికి బాటలు

నవీపేట,మార్చి25(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో సిద్ధపడుతుందని, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశ ఆర్థిక భారం తగ్గడంతో పాటు ఆర్థికంగా పురోగమిస్తుందని ఒకే దేశం, ఒకే ఎన్నిక జిల్లా కన్వీనర్ కొండ ఆశన్న అన్నారు. మంగళవారం మండలంలోని హనుమాన్ ఫారంలో జరిగిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జమిలి ఎన్నికల విధానానికి అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కారక్రమంలో రాంచందర్, బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, వంశీ మోహన్, శ్రీనివాస్ గౌడ్, భూషణ్, శ్రీకాంత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

హిందు ధర్మం పవిత్రమైంది

● మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్

రెంజల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): అన్ని ధర్మాల్లోకెల్లా హిందు ధర్మం పవిత్రమైందని మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని నీలా గ్రామంలో హిందు వాహిని ధ్వజస్తంభాన్ని కందకుర్తి ఆశ్రమ పీఠాధిపతి అయోధ్య సీతారాం త్యాగి మహరాజ్‌తో కలిసి హిందువాహిని జెండాను ఆవిష్కరించారు. అన్ని ధర్మాలలో కెల్లా హిందు ధర్మం అత్యంత పవిత్రమైందని, సనాతన ధర్మం ద్వారా ప్రపంచ దేశాలు సైతం హిందు ధర్మాన్ని ఆచరిస్తున్నాయని, భక్తిమార్గం ద్వారా హైందవ ధర్మాన్ని పెంపొందించుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు యోగేష్, రాఘవేందర్, శివ, గణేష్, నాగభూషణం, సుభాష్, ఎస్ఐ సాయన్న, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేగాంలో సీసీరోడ్డు పనుల ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో మంగళవారం స్మశాన వాటిక సమీపంలో సీసీరోడ్డు పనులను గ్రామస్థులు ప్రారంభించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేయించారు. ఇట్టి నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేప ట్టారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్‌లకు రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి, రమేష్, ప్రణీత్‌గౌడ్, రవిలు ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ పటిష్ఠతకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

● డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి



నందిపేటలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి

నందిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కుంట రమేష్ రెడ్డి కోరారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలోని సాయి బాబ గార్డెన్‌లో ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సూచించారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం హయాంలో మహాత్మా గాంధీ గురించి అసత్య ప్రచారాలు చేయడం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురించి పార్లమెంట్‌లో అవహేళన చేస్తూ మాట్లాడడం జరుగుతుందని తెలిపారు. ఇందు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పాదయాత్రలు చేసి, కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేసి బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఐలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, నాయకులు పిప్పెర సాయరెడ్డి, దూడ వెంకటేష్, జి రాజేందర్, లక్ష్మీనారాయణ, తధితరులు ఉన్నారు.

అపరాధ రుసుము లేకుండా ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వ్యాపార సముదాయాల యాజమానులు అపరాద రుసుము లేకుండా ట్రేడ్ లైసెన్స్ లను రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు కోరారు. ఈనెల 31వ తేదీ వరకు ఎలాంటి అపరాద రుసుము ఉండదని, ఆ తర్వాత రెన్యువల్ చేసుకునే వారికి 25శాతం జులై 1వ తేదీ నుంచి రెన్యూవల్ చేసుకునే వారికి 50శాతం అపరాద రుసుము ఉంటుందని మున్సిపల్ పరిధిలోని దుకాణ యాజమానులు గ్రహించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

మూడు టిప్పర్‌లు, జేసీబీ పట్టివేత

ముప్కాల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని వన్నెల్(బి) గ్రామశివారులో గల ఎస్సారెస్పీ వరదకెనాల్ వద్ద నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, మూడు టిప్పర్‌లను పట్టుకున్నట్టు స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై నరేష్ తెలిపారు. ఇరిగేషన్ ఏఈ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సాపూర్ గ్రామానికి జాపు భూమన్నపై కేసు నమోదు చేసినట్టు జేసీబీ, టిప్పర్‌లను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

కమలాపూర్ శివారులో చిరుత సంచారం

నవీపేట,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ శివారులో చిరుత పులి సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా గ్రామ శివారులో చిరుత పులి సంచరిందని పశువుల కాపర్లు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. గ్రామశివారులో చిరుత పులి సంచరిస్తుండడం పట్ల స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ సెక్షన్ అధికారి జహుర్‌ను వివరణ కోరగా మంగళవారం రాత్రి సైతం గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తున్నట్లు తమకు ఫోన్‌లు రాగా తమ సిబ్బందిని గ్రామానికి పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

బోధన్‌రూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పంట దళారుల చేతికి వెళ్లకముందే ప్రభుత్వం అన్ని చోట్ల వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని పెద్ద మావంది గ్రామంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట కోతలు ప్రారంభమయ్యాయన్నారు. రైతులు వర్షాలు వస్తాయో ఏమో అని భయపడి దళారులకు, రైస్‌మిల్లర్లకు అమ్ముకుంటున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతన్నలు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప, ఉపాధ్యక్షుడు పులి ముత్తెన్న, లక్ష్మణ్, అశోక్ రెడ్డి, జంగయ్య, వీరేశం, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలకృత్యాలకు వెళ్లి కూలి మృతి

● మారుతి మృతదేహం వెతకడానికి వెళ్లి కాలువలో పడి మరొకరు గల్లంతు



మెండోర,మార్చి25(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలువలో కాలకృత్యాలకు వెళ్లి మారుతి దేశ్‌ముఖ్(32) గల్లంతు కాగా మంగళవారం మృతదేహం లభ్యమై నట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నాందేడ్ జిల్లా టీంగస్‌వాడి గ్రామానికి చెందిన వాడని మెండోర గ్రామంలో కూలీ పని చేయడానికి రెండు నెలలక్రితం వచ్చాడని ఆదివారం సాయంత్రం కాలకృత్యాల కోసం కాకతీయ కాలువలోకి వెళ్లగా రాత్రికి కూడా ఇంటికి రాక పోవడంతో కాకతీయ కాలువ ఇరువైపులా వెతకగా వెల్కటూర్ శివారులో కాలువలో మారుతి మృతదేహం లభ్యమైందని ఎస్సై తెలిపారు.మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టుఎస్సై వివరించారు.

● మారుతి మృతదేహం వెతకడానికి వెళ్లి మరొకరు గల్లంతు

ఆదివారం సాయంత్రం మారుతి మృతదేహం కాకతీయ కాలువలో గల్లంతు అయిన విషయం తెలుసుకున్న సమీప బంధువు రాజారాం ద్విచక్ర వాహనంపై కాకతీయ కాలువ ఆనకట్ట వెంట వెతుకుతుండగా ద్విచక్ర వాహనంతో పాటు రాజారాం వెల్కటూర్ గ్రామ శివారులో కాకతీయ కాలువలో పడి గల్లంతయ్యాడు.ద్విచక్ర వాహనంకాలువఒడ్డుకు ఉండడంతోవాహ నాన్ని బయటకు తీశారు.రాజారాంమృతదేహం కోసంగాలిస్తున్నారు.రాజారాం సమీప బంధువు మారుతీ కాకతీయ కాలువలో గల్లంతు విషయం తెలుసుకొని మారుతి మృతదేహం వెతకడానికి వెళ్లి రాజారాం గల్లంతైన విషయం తెలువగానే కుటుంబ సభ్యులు,సమీపబంధువులు కన్నీటి పర్యాంతమయ్యారు.

హనుమాన్ స్వాముల మండల భిక్ష


నీలాలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వాములు

రెంజల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా గ్రామంలో మంగళవారం హనుమాన్ స్వాములు మండల భిక్ష నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ స్వాములు మండల భిక్షలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ స్వాములకు గ్రామంలోని ప్రధాన ద్వారం గుండా మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామంలోని ర్యాలీగా ప్రారంభమైన హనుమాన్ స్వాములు హనుమాన్ నామస్మరణ జపిస్తూ గ్రామంలోని హనుమాన్ మందిరం వరకు ర్యాలీగా చేరుకున్నారు. ర్యాలీలో స్వాములకు మంగళహారతులతో స్వాగతం పలికారు. డీజే చప్పులతో హనుమాన్ స్వాములతో నీలా గ్రామం మారుమ్రోగింది. అనంతరం హనుమాన్ స్వాములు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ సాయన్న ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



బీటీ లేచి కంకర తేలిన ఉప్లూర్ తిమ్మాపూర్ రహదారి

ఉప్లూర్ గ్రామశివారులో గుంతలమయంగా మారిన రహదారి

ప్రమాదకరంగా ఉప్లూర్, తిమ్మాపూర్ రహదారి

- మరమ్మతులకు నిధులు మంజూరైనా ప్రభుత్వం మారడంతో రద్దు అయిన నిధులు
- ప్రభుత్వం స్పందించి పనులు చేపట్టాలంటున్న రైతులు

కమ్మర్‌పల్లి, మార్చి 25: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామాలను కలిపే రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో వ్యవసాయ భూములు ఉన్న రైతులకు, ఇటు రెండు గ్రామాలకు ప్రయాణాలు సాగించే వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. రెండు గ్రామాలను కలిపే ఉప్లూర్, తిమ్మాపూర్ రహదారి మరమ్మతుల నిమిత్తం అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెండు గ్రామాల మధ్య రహదారి మరమ్మతులతో పాటు చిన్న చిన్న కల్వర్టు ఏర్పాటు నిమిత్తం పంచాయితీ రాజ్ శాఖ నుంచి రూ.7.50 లక్షల ఆర్ఆర్ఎం నిధుల నుంచి మంజూరు చేయించారు. కాగా, 29మార్చి 2022 రోజున పనులకు శంకుస్థాపనలు చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు దీంతో ఎన్నికలు రావడం అధికారంలోకి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రారంభంకాని పనులకు మంజూరైన నిధులను రద్దు చేసింది. ఇందులో భాగంగానే ఉప్లూర్ తిమ్మాపూర్ రహదారి మరమ్మతులను మంజూరైన నిధులు సైతం రద్దు అయ్యాయి. అయితే నిధులు రద్దు చేసినా ప్రభుత్వం తిరిగి నిధులు మంజూరు చేయించేలా స్థానిక ప్రజాప్రనిధులు శ్రద్ధ చూపకపోవడంతో రహదారి పరిస్థితి మరింత అస్తవ్యస్తంగా మారింది. గతంలో బీటీ రోడ్డు ఉన్న ఈ రహదారి బీటీ పగుళ్లు చూసి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ఈ రహదారిపైన ఉన్న కల్వర్టు వర్షాల కారణంగా కుంగి గుంతలుగా ఏర్పడడంతో ఈ ప్రాంతంలో పంట పొలాలు ఉన్న రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకున్నారు. బీటీ లేచిపోవడంతో కంకరతేలి అటు పంట పొలాలకు, ఇటు రెండు గ్రామాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. కాగా ఈ రహదారిపై ప్రమాదకర మలుపులు ఉండడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చి యుద్ధ ప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టాలని ఉప్లూర్, తిమ్మాపూర్ గ్రామాల ప్రజలు రైతులు కోరుతున్నారు.



వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిన రహదారి

ఉప్లూర్, తిమ్మాపూర్ రహదారికి నిధులు మంజూరు చేయించాలి

- పిప్పెర అనిల్ మాజీఎంపీటీసీ ఉప్లూర్



గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయిస్తే ఈ ప్రభుత్వం వచ్చిరాగానే మంజూరైన నిధులు రద్దు చేసింది. తిరిగి నిధులు మంజూరు చేయించి రహదారి మరమ్మతులు చేపట్టాల్సింది మర్చిపోయింది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ రహదారి రెండు గ్రామాలకు వారధి లాంటిది. పైగా వ్యవసాయ పంటపొలాలకు అనుకూలంగా ఉండే రహదారి మరమ్మతులు లేక అధ్వానంగా మారి ప్రమాదాలకు దారి తీస్తున్నది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తెచ్చి నిధులు మంజూరు చేయించి మరమ్మతు పనులతో పాటు కల్వర్ట్ నిర్మాణ పనులు చేయిచాల్సిన అవసరం ఉంది.



బస్టాండ్ కాంప్లెక్స్‌లో మూతపడిన దుకాణాలు

బస్టాండ్ మడిగెలు కొందరి చేతుల్లోనే!

- చక్రాధిపత్యం చేస్తున్న ఆర్టీసీ మాజీ ఉన్నతాధికారి
- గత 10 నెలలుగా అద్దె చెల్లించలేక మూసి ఉన్న దుకాణాలు
- బస్టాండ్ కాంప్లెక్స్‌పై నీలినీడలు

డిచ్‌పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి బస్టాండ్ కాంప్లెక్స్ పరిధిలోని వ్యాపార సముదాయలు ఆర్టీసీ అధికారుల వైఫల్యంతో గత 10 నెలలుగా మూసి ఉంటున్నాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్న వ్యాపారులు టెండర్లు వేసి చిన్న దుకాణాలు నడుపుకుంటున్నారు. వీరికి ఆ దుకాణాలు దక్కకుండా టెండర్లలో ఆర్టీసీకి చెందిన కొందరు మాజీ ఉన్నత అధికారులు వారి అధికారులను ప్రసన్నం చేసుకొని ఆ మడిగెలను దక్కించుకుంటూ అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారు. ఆర్టీసీలోని కొందరు ఉన్నతాధికారులే ఈ మడిగెలను తక్కువకు వచ్చేలా ప్లాన్ వేసుకొని ఇద్దరు ముగ్గురుతో టెండర్లు వేయించి మడిగెలను పొందుతున్నారు. టెండర్లలో పొందిన ఆ మడిగెలను వారు ఎక్కువ రేటుకు చిన్న వ్యాపారులకు అద్దెకు ఇచ్చి రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్నారు. అక్రమంగా మడిగెలను పొందుతున్న ఆర్టీసీ మాజీ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్లను పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు.

● ఒక్కో మడిగెకు రూ.15 వేల వరకూ వసూలు

ఒక్కో మడిగెకు రూ.15వేల కిరాయిలు వసూలు చేస్తూ పేద వ్యాపారుల వద్ద అధిక డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయా మడిగెలకు కేటాయించిన దుకణాలకు బదులు వేరే దుకాణాలను ఏర్పాటు చేయిస్తున్నారు. అందుకు వీరు అదనంగా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినబడుతున్నాయి. దీంతో ఇప్పటి వరకు చెల్లించిన వ్యాపారులు తమతో అంత అద్దె కట్టలేమంటూ దుకాణాలను మూసివేశారు. ఆర్టీసీకి రావాల్సిన ఆదాయం కొందరి చేతుల్లోకి అక్రమంగా పోతుందని వీటిపై ఆర్టీసీ యాజమన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పుడు ఈ మడిగెలు గత 10 నెలలుగా మూసి వుంచడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోతుంది.

నూతన కాంప్లెక్స్‌పై సన్నగిల్లిన ఆశలు

గత బీఆర్ఎస్ హయాంలో మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాలకు మేరకు కాంప్లెక్స్ (దుకాణ సముదాయం) నిర్మాణానికి ప్రయత్నాలు సాగాయి. కానీ ప్రభుత్వం మారడంతో ఈ విషయంలో ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కాంప్లెక్స్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ పంపు ఏర్పాటు చేయాలని గత మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి ఆదేశాలు ఇచ్చారు. అందుకు అనుగుణంగా అధికారులు సైతం గతంలో సర్వే నిర్వహించి ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన సైతం మూలన పడింది. తక్షణమే ఆర్టీసీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి డిచ్‌పల్లిలో దుకాణ సముదాయాలతోపాటు పెట్రోల్ పంపు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సుభాష్‌నగర్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్లమెంట్ కన్వీనర్ దేగం యాదాగౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 29న తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో, గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం రోజు ప్రతీ కార్యకర్తకు దిశానిర్దేశం చేయాలని తెలిపారు.

గుంతలమయంగా ముల్లంగి-దూస్‌గాం రోడ్డు



గుంతలమయంగా ముల్లంగి-దూస్‌గాం రోడ్డు

డిచ్‌పల్లి,మార్చి25 (ఆంధ్రజ్యోతి): ముల్లంగి గ్రామం నుంచి దూస్‌గాం వరకు వేసిన బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్థులు చెప్తున్నారు. కిలోమీటర్లలో సుమారు 25 గుంతల వరకూ ప్రమాదకరంగా ఉంటాయని, అయినా అధికారులు మరమ్మతులు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఫటా..ఫట్...

ఈనెలాఖరు వరకు ఇంటి పన్ను చెల్లించాలి

- రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్



ఆర్మూర్‌టౌన్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఈనెలాఖరు వరకు ఇంటి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ఇంటి పన్నుపై మున్సిపల్ కమిషనర్ 'ఆంధ్రజ్యోతి'లో ఇంటర్వ్యూ విశేషాలు.

ఆంధ్రజ్యోతి: మున్సిపల్‌లో ఇంటి పన్నుల వసూళ్ల డిమాండ్ ఎంత ఉంది ?

కమిషనర్: మున్సిపాలిటీలో 36వార్డులలో 2024- 25 ఏడాదికి రూ.6కోట్ల 51లక్షల 44వేల ఇంటి పన్ను డిమాండ్ నోటీసులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎంత పన్ను వసూలు చేశారు?

కమిషనర్: ఇప్పటివరకు 75శాతం పన్ను వసూలుచేశాం. సుమారు రూ.4కోట్ల 51లక్షల 70వేలు వసూలయ్యాయి.

ఆంధ్రజ్యోతి: పన్ను వసూళ్లకు ఎలాంటి ప్రణాళికలు రచించారు?

కమిషనర్: ప్రతీవార్డులో వార్డు ఆఫీసర్‌తో కలిసి ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వంద శాతం పన్ను వసూళ్లను చేపడతాం.

ఆంధ్రజ్యోతి: బకాయిలు ఉన్న వారిపై ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

కమిషనర్: బకాయిలు ఉన్న వారికి నోటీసులు అందజేశాం. గడువు లోపు చెల్లించకపోతే చర్యలు చేపడతాం.

ఆంధ్రజ్యోతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్నులు వసూలు చేస్తున్నారా?

కమిషనర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలవి రూ.కోటి 21 లక్షల 28వేల డిమాండ్ నోటీసులు ఉన్నాయి. ఇప్పటివరకు చెల్లించని వాటికి నోటీసులు అందజేశాం. కొద్దికొద్దిగా పన్నులువసూలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పన్ను వసూళ్లలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా?

కమిషనర్: పన్ను వసూళ్లలో సుమారు వందకు పైగా బోగస్ అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. తల్లిదండ్రుల ఆస్తిని కుమారుల పేరిట రిజిస్ట్రేషన్ కావడంతో పాతవి, పాత అసిస్‌మెంట్‌లు అలాగే ఉండిపోయి కొత్త అసిస్‌మెంట్‌లు రావడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. వాటిని త్వరలోనే సరిచేస్తాం.

సమస్యల వలయంలో విలీన గ్రామాలు!

- మున్సిపాలిటీలో కలిసినా అభివృద్ధికి నోచుకోని ఆర్మూర్ శివారు కాలనీలు



కొటార్మూర్ శివారులో కచ్చ డ్రైనేజీ

ఆర్మూర్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లోని శివారు కాలనీలో సమస్యలు తిష్ఠవేశాయి. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి అంతంత మాత్రమే. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్ గ్రామాలలో 2018లో ఆర్మూర్ మున్సిపల్‌లో విలీనం చేశారు. అప్పటికి మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న పెర్కిట్, మామిడిపల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులు తమ గ్రామాలను ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు అంగీకరించలేదు. అంతేకాకుండా ఆర్మూర్ మున్సిపాలిటిలో కలుపవద్దని గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం రాష్ట్రస్థాయిల్లో మున్సిపాలిటీల సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేస్తూ రాష్ట్రప్రభుత్వం నుంచి గెజిట్ విడుదల చేశారు.

విలీనమైనా అభివృద్ధికి దూరంగా..

మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలలో అభివృద్ధి పనులకు అంతగా నోచుకోలేదు. కానీ మున్సిపల్ పన్నులు మాత్రం పెరిగాయి. అప్పటి ప్రభుత్వం విలీన గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రధాన రహదారుల వెంబడి డివైడర్ల నిర్మాణం, రోడ్ల సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్‌తోపాటు అన్ని మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తామని హామీ ఇచ్చారు. మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్‌లో సెంట్రల్ లైటింగ్‌లు ఏర్పాటు కాలేదు.

సమస్యల వలయంలో శివారు కాలనీలు

పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లిలోని శివారు కాలనీలో సమస్యలు తిష్ఠవేశాయి. పెర్కిట్, కొటార్మూర్ శివారులోని శ్రీనివాసనగర్, అన్నపూర్ణకాలనీ, విశాఖనగర్, తిరుమల కాలనీ, సరస్వతీ నగర్, మామిడిపల్లిలోని శ్రీరామ కాలనీ, ఆదర్శనగర్, విద్యనగర్ కాలనీలలో పలుచోట్ల డ్రైనేజీలు నిర్మించకపోవడంతో కచ్చ డ్రైనేజీలు, రోడ్లపై మురికి నీరు పారడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కచ్చ డ్రైనేజీలతో మురికి నీరు నిలవడం వల్ల దోమల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలను నిర్మించి మురికి కాలువల ద్వారా నీరు సాఫీగా బయటకు వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలను నిర్మించాలి

- అశోక్, శ్రీనివాస నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్



శ్రీనివాస నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందిగా మారింది. ఈ విషయమై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించలేదు. కాలనీలో దోమల బెడద ఎక్కువైంది. కాలనీలో సీసీ రోడ్లు నిర్మించి ప్రజల అవస్థలను తొలగించాలి.

లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ ఇంకెప్పుడు?

- నిర్మాణ పనులు పూర్తయి ఏడాది గడిచినా కేటాయించని వైనం
- ఆశగా ఎదురు చూస్తున్న 36 మంది లబ్ధిదారులు



బీర్కూర్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న రెండు పడకల గదులు

బీర్కూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో బీర్కూర్ మండల కేంద్రంలోని జ్యోతిబా గురుకుల పాఠశాల పక్కన 36 డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించారు. నిర్మిణ పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు పంపిణీకి నోచుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు ఎప్పుడు పంపిణీ చేస్తారా? ఎప్పుడు గృహప్రవేశం చేద్దామా..? అని లబ్ధిదారులు గంపడు ఆశతో ఇళ్ల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీర్కూర్ గ్రామానికి మొదటివిడతలో 114 డబుల్‌బెడ్ రూమ్‌లను మంజూరు చేయించారు. అనంతరం డబుల్‌బెడ్‌రూమ్‌లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయినప్పటికీ సొంత ఇళ్లు లేనివారు, అద్దె ఇళ్లలో ఉండే పేదల కోసం పోచారం శ్రీనివాస్‌రెడ్డి రెండో విడతలో మరో 150 ఇళ్లు మంజూరు చేయించారు. ఇందులో 114మంది తమ సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన 36 ఇళ్లు ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు గుత్తేదారుడికి అప్పగించారు. అయితే గుత్తేదారుడు పూర్తిస్థాయిలో ఇళ్లు నిర్మించి అధికారులకు అప్పగించాడు. ఇది జరిగి కూడా ఏడాది గడిచినా లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయకుండా అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్లపంపిణీ చేయకుండా అలాగే వదిలేయడంతో డబుల్ బెడ్ రూమ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఇదిలా ఉండగా కొన్ని నెలల కిందట కొంతమంది దుండగులు ఆ ఇళ్ల లోపలికి ప్రవేశించి తలుపులు, కిటికీలు, విద్యుత్ బోర్డులను ధ్వంసం చేశారు. నిర్మించిన ఇళ్లు లబ్ధిదారులు అప్పగిస్తే నష్టం జరగకుడా ఉంటుందని తెలిసినా పంపిణీలో జాప్యం వహరిస్తున్నారు. గత కొన్నిరోజుల క్రితం లబ్ధిదారులు డబుల్‌బెడ్ రూమ్‌లలోకి ప్రవేశించి ఇళ్లను కబ్జా చేసుకోవడానికి యత్నించారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. త్వరలో ఇళ్లను పంపిణీ చేస్తామని హామీనిచ్చారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పేదలకు ఇళ్లు పంపిణీ మాత్రం చేపట్టలేదు. ఇళ్ల కోసం అధికారులకు సుమారు 200 వరకు దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. 36 ఇళ్ల కోసం రెండు వందల మంది పేదలు ఎదురు చూస్తున్నారు. రాజకీయ కారణాల వల్లే ఇళ్ల పంపిణీ చేపట్టలేదని తెలుస్తోంది. అధికారులు వెంటనే స్పందించి అర్హులైన పేదలకు ఇళ్లను పంపిణీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 'రాజీవ్ యువ వికాసం' అవకాశం

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈబీసీ), ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యుఎస్)లకు చెందిన వారికి సైతం ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నివ్వనున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపజేయనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈబీసీ, ఈడబ్ల్యుఎస్ వర్గాలకు చెందిన వారు ఆర్థిక సహాయం కోసం టీజీవోబీఎంఎంఎస్న్యూ.సిజీజీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఈ అవకాశాన్ని జిల్లాలోని ఈబీసీ, ఈడబ్ల్యుఎస్ వర్గాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నగరంలో డివిజన్‌లకు ఇన్‌చార్జీల నియామకం

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం సందర్భంగా నగరంలోని 54 డివిజన్‌లకు ఇంచార్జీలను నియమించినట్లు నగర అధ్యక్షుడు కేశవేణు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు డివిజన్‌లకు కోఆర్డినేటర్లను నియమించారు. 6, 22 డివిజన్‌లకు రత్నాకర్‌గౌడ్, 23, 24, 25 డివిజన్‌లకు అంతిరెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి, 26, 7, 8, 50 డివిజన్‌లకు రామర్తిగోపి, 9, 28, 51 డివిజన్‌లకు రాంభూపాల్, 10, 11, 12 డివిజన్‌లకు మోయిన్, 13వ డివిజన్‌కు అరోస్, 14వ డివిజన్ ఎజాజ్, 15, 16 డివిజన్‌లకు ఢిల్లీ (భక్తవత్సలం), 17, 37, 38, 39 డివిజన్‌లకు గడుగు రోహిత్, 19, 41, 42 డివిజన్‌లకు శ్రీనివాస్‌రెడ్డి, గోపు ప్రభాకర్, 20, 21, 45కు జావిద్ అక్రమ్, 27 డివిజన్‌కు రఘువీర్‌సింగ్, 29, 30, 31 డివిజన్‌లకు అబుద్ బిన్ హందాన్, 32వ డివిజన్‌కు ముజాయిద్ ఖాన్, 33వ డివిజన్‌కు షైమద్, 34వ డివిజన్‌కు ధరణి దుర్గాప్రసాద్, ప్రమోద్, 35, 36వ డివిజన్‌లకు విక్కీయాదవ్, 40వ డివిజన్‌కు చరణ్, 43వ డివిజన్‌కు సలీమ్, ఎర్రం గంగాధర్, 44, 46వ డివిజన్‌లకు ఈసా, 47, 48, 49 డివిజన్‌లకు బొబ్బిలి రామకృష్ణ, 52వ డివిజన్‌కు నవాజ్, ఇప్తికార్, 53, 54, 55వ డివిజన్‌లకు ఎజాజ్, 56, 57, 58, 59 డివిజన్‌లకు నరాల రత్నాకర్, 60వ డివిజన్‌కు అలీలను నియమించినట్లు కేశవేణు తెలిపారు.

నగరంలో స్టేడియంను నిర్మించాలి

● అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇందూరు నగరంలో 6 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో ఉన్నటువంటి పాత కలెక్టరేట్ స్థలంలో మినీ స్టేడియాన్ని నిర్మించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అసెంబ్లీలో మాట్లాడారు. అంతేకాకుండా పాత ఇరిగేషన్ భవనం స్థలం ప్రాంతంలో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించాలన్నారు. 30 సంవత్సరాల క్రితం 15 ఎకరాల్లో ఏర్పాటు చేసిన రాజారాం స్టేడియంలో ఇప్పటి వరకు ఎటువంటి సౌకర్యాలు లేక నిరాధారణకు గురైందని రాజారాం స్టేడియంను వెంటనే పూర్తిస్థాయి క్రికెట్ స్టేడియంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశానికి, రాష్ట్రానికి గొప్ప పేరు తెచ్చేందుకు ఇందూరు బిడ్డలు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వ ప్రోత్సాహం సరైన వసతులు లేక ఫుల్‌టైమ్ కోచ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో మంత్రి గారికి పలుమార్లు విన్నవించానని ఈ బడ్జెట్‌లో అయినా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

'కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరిస్తుంది'

ఖిల్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రరైతు సంఘం మూడో సభలను ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నల్లచట్టాలను తెచ్చి రైతులను నిండా ముంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కంజర భూమయ్య, రైతు సంఘం రాష్ట్రఅధ్యక్షుడు హేమంత్‌రావు, ప్రధాన కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో జాతీయ కాంగ్రెస్ పార్టీ జైబాపు, జైభీమ్, జైసం విధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని దీనిని జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఉర్దూ అకాడమి చైర్మన్, కార్యక్రమ రాష్ట్ర ప్రతినిధి తాహెర్‌బిన్ హందాన్ పిలుపునిచ్చారు. మంగళవారం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు ఆధ్వర్యంలో అర్బన్ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా కాం గ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖిల్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న డెలివరీ మ్యారేజ్ సహజ మరణంకు సంబంధించిన క్లైమ్‌ల సమస్యను పరిష్కరించాలని వై.ఓమయ్య డిమాండ్ చేశారు. ఈకార్యక్ర మంలో విఠల్‌గౌడ్, నల్లగంగాధర్,ఒల్లెపు గంగాధర్, వీరేశం, గంపలహన్మాండ్లు, శావలం నారాయణ, కప్ప నగేష్, శ్రీనివాస్, చాకలి గంగాధర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

'మా భూమిని మాకు ఇప్పించండి'

ఇందల్వాయి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కొన్న భూమిని కాకుండా సొంత భూమిని సైతం కబ్జా చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఓ బాధితుడు మంగళవారం తహసీల్దార్ వెంకట్రావ్‌ను వేడుకున్నారు. భూమి సరిహద్దును చూపి తన భూమిని తనకు ఇప్పించాలని వేడుకున్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బండ్ల ఒడ్డెన్న సర్వే నెంబర్ 182లో 36 ఏళ్ల క్రితం సుగ్గిం నర్సయ్య దగ్గర 16న్నర ఇసాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేశారు. కొన్న నాటి నుంచి వ్యవసాయ పనులు సైతం చేస్తున్నారు. సుగ్గిం నర్సయ్య వారసులు సుగ్గిం నవ్య, భర్త కిరణ్‌లు కొనుగోలు చేసిన బండ్ల ఒడ్డెన్న కుటుంబీకులకు తెలియకుండా తన తాత సుగ్గిం నర్సయ్య పేరు మీద ఉన్న భూమిని వారసత్వం కింద పట్టా మార్చుకున్నారు. దీంతో సుగ్గిం నవ్య దంపతులు 16న్నర ఇసాల అమ్మిన భూమిని సగం వరకు గత సంవత్సరం నుండి కబ్జా చేస్తూ భూమి కొనుగోలు చేసిన బండ్ల ఒడ్డెన్న కుటుంబాన్ని బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాధితుడు వాపోయారు. సర్వే నెంబర్ 40లో సైతం తన సొంత 5 ఇసాల భూమిని సైతం కబ్జా చేశారని తెలిపారు. గతంలో పలుసార్లు సర్వే నెంబర్ 40లో భూమి సర్వే చేసి మా భూమిని మాకు ఇప్పించాలని పలుసార్లు దరఖాస్తులు చేసుకున్నా సర్వేను అడ్డుకొని బెదిరిస్తున్నాడని అన్నారు. మంగళవాం తాను కొనుగోలు చేసిన భూమిలో బోరు మోటారు వేశాడని తహసీల్దార్‌కు విన్నవించారు.సర్వేనంబర్ 40,182లో భూమిని కబ్జా చేసి మాపై దౌర్జన్యం చేస్తున్న సుగ్గిం నవ్య, భర్త కిరణ్‌లను చట్టపరమైన చర్యలు తీసుకొని మా భూమిని మాకు ఇప్పించాలని బాధితుడు బండ్ల ఒడ్డెన్న అధికారులకు కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకట్రావ్ సర్వేయర్ రంజిత్‌నుపిలిచి భూమినిసర్వే చేసి పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో కోటి తలంబ్రాల దీక్ష



తలంబ్రాలను తయారు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారాముల కల్యాణానికి ప్రతియేటా అందించే తలంబ్రాలను జిల్లాకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల అతిపురాతనమైన జైర్‌కోట్ హనుమాన్ ఆలయంలో భక్తులు తలంబ్రాలను తయారు చేశారు. 250 కిలోల గోటితో వడ్లను ఒలచి తలంబ్రాలుగా మలిచారు. ఈ సందర్భంగా ప్రతినిధులు రామ కోటి రామరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ గ్రామాన భక్తులు గట్టి సంకల్ప దీక్షతో రామకోటి భక్తసమాజం ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల యజ్ఞాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నో జన్మల పుణ్యమో ఈ భగవత్ కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ తలంబ్రాల కార్యక్రమానికి మైసమ్మ భజనమండలి, జైర్ కోట్ భజన మండలి, మల్లికార్జున భజన మండలి, విజయ గణపతి భజనమండలి, భక్తులుమహా తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు.

● వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం

వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణలతో శ్రీనివాసుడి మాసకల్యాణం వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ వెంకటేశ్వరస్వామి క్షేత్రంగా విరాజిల్లుతున్న జెండా బాలాజీ మందిర్‌లో అర్చకులు వెలగలేటి నాగరాజచార్య కళ్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా బ్రహ్మపురి చక్రం గుడి లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన కళ్యాణంలో పండితులు కందాళై హైగ్రీవాచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు నాగ రాజచార్య, నర్సింహామూర్తి కల్యాణ వేడుకలను జరిపారు. కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన విశ్వక్‌సేన, పుణ్యహావాచన, యజ్ఞోపవిత ధారణ, జీలకర్ర బెల్లం, కన్యాదానం, మాంగళ్యసూత్ర పూజ, మాంగళ్య సూత్ర ధారణ, తలంబ్రాలు, మా లావరివర్తన, బ్రహ్మముడి తంతును అర్చకులు నిర్వహించగా భక్తులు భక్తిపారవశంతో తిలకించారు. ఈ కార్యక్రమంలో నరేందర్, మహేష్, జనార్ధన్, తదితర భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముబారక్ నగర్‌లో గల సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా సాగింది. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం సాయిబాబాకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించి సాయినాథునికి విశేష ఆరతి పూజలు చేశారు. అనంతరం జరిగిన మహా అన్నప్రసాదంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, వేణుసత్యం, కోటేశ్వర్‌రావు, అమర్‌జిత్‌రెడ్డి,గంగాధర్, వినయ్, పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తన పంట వైఫల్యాలపై సదస్సులో గడుగు

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మూలుగు జిల్లాలోని ఆదివాసి గిరిజన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కజొన్న విత్తన పంట వైఫల్యాలపై జరిగిన సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మొక్కజొన్న విత్తన పంట వైఫల్యంపై రైతులు, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఇందల్వాయిలో మహాజన సభ

ఇందల్వాయి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఖిల్లా రామాలయంలో మహాజన సభ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆరు నెలల జమాఖర్చులు గత సమావేశం తీర్మాన అంశాలు, వరిధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈకార్యక్రమంలో చైర్మన్‌చింతలపల్లి గోవర్ధన్, వైస్‌చైర్మన్ మారుతి, ఎన్‌డీసీసీ డైరెక్టర్ ఆనంద్, డైరెక్టర్లు మల్లారెడ్డి, నామాల గంగాధర్, బాలవ్వ, రాజేందర్, సీఈవో రతన్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది హత్య పట్ల నిరసన

నిజామాబాద్ లీగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):న్యాయవాది హత్యను నిరసిస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిరసన తెలియజేశారు. రంగారెడ్డి బార్ అసోసియేషన్ న్యాయవాది ఎర్రబాపు హత్యను నిరసిస్తూ జిల్లా బార్ అసోసియేషన్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ వసంత్ రావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇసుక క్వారీ కోసం సర్వే

ధర్పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):మండలంలో ప్రభుత్వ ఇసుక క్వారీ కోసం మంగళవారం అధికారుల బృందం సర్వే నిర్వహించారు. ఈ బృందంలో మైనింగ్, భూగర్భ జలాలు, రెవె న్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్‌కు సంబంధించి జిల్లా అధికా రులు సర్వేను చేపట్టారు. మండలంలోని మైలారం, రామడుగు, దుబ్బాక, సీతాయిపేట్, ఒన్నాజీపేట్, వాడి గ్రామాల్లో అధికార బృందం సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు పంప నున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. ఆయా వాగుల్లో సర్వే నిర్వహించిన అధికారులు ఇసుక లభ్యత, భూగర్భ జలాలు, రెవెన్యూ శివారు, నీటిలభ్యత తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీ లించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఇసుక క్వారీ పాయింట్‌పై సాండ్ కమిటీలో కలెక్టర్ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. మండలంలోని రామడుగు, సీతాయిపేట్, దుబ్బాక గ్రామాల్లో ఇసుక పాయింట్‌కు అనువుగా ఉన్నట్లు మైలారం గ్రామంలో గ్రామస్తుల నిర్ణయం మేరకు ప్రభుత్వం ఇసుక పాయింట్‌కు అనుమతి ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది.

ఒకరికి రెండు రోజుల జైలు

ధర్పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహ నం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పును వెల్లడించారు. మండల కేంద్ర శివారులోగల ఎల్లమ్మ ఆలయం వద్ద ఈనెల 21న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దారావత్ రఘు అనే వ్యక్తి మద్యం తాగి ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా పోలీసులు పరిశీలించగా అతను 204 ఎంజీ మద్యం మోతాదు సేవించినట్లుగా తేలిందని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గిరిరాజ్‌లో జాబ్‌మేళాకు 30 మంది ఎంపిక

నిజామాబాద్‌అర్బన్,మార్చి25(ఆంధ్రజ్యోతి):గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ విభాగాల ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సెస్ బ్యాంక్, శ్రీచైతన్య టెక్నోస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో త దుపరి రౌండ్‌కు30మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రా మ్మోహన్‌రెడ్డి తెలిపారు.నైపుణ్య శిక్షణ,ఉపాధికల్పనలో కళాశాల ఎప్పుడూ ముందంజలో ఉందని సమన్వయకర్త రామకృష్ణ తెలిపారు.

కేవోఎస్‌లో ఆకట్టుకున్న టెట్రోనికా రోబోటిక్స్ ఎక్స్‌పో



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో అశోక్



విద్యార్థులు ప్రదర్శిస్తున్న రోబోటిక్ ప్రదర్శనలు

● ప్రదర్శనలను తిలకించిన డీఈవో

నిజామాబాద్ అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన టెట్రోనికా రోబోటిక్స్ ఎక్స్‌పో-2025 ఆహుతులను ఆకట్టుకుంది. నగరంలోని ప్రగతినగర్ కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేటి తరానికి అందించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల మేధస్సు తిరిగి ఎన్నో సృజనాత్మకత ప్రయోగాలు సృష్టించబడి భవిష్యత్తు తరాలకు, దేశానికి ఎంతో మంది శాస్త్రవేత్తలు పుట్టుకొచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని దేశానికి ఉపయోగపడే ప్రాజెక్టులను తయారు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం విద్యార్థులంతా సెల్‌ఫోన్ మాయలో పడి చదువును దూరం చేసుకుంటున్నారని అలా కాకుండా ఇలాంటి రోబోటిక్స్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను చదువువైపు దృష్టి మళ్లించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ తేజస్విని మాట్లాడుతూ రాబోయే పదేళ్లలో రోబోటిక్స్ మానవుని దైనందిన జీవితాల్లో 50 శాతం ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యవసాయం, రక్షణశాఖ, ఉత్పాధికరంగం, విద్యా, వైద్య రంగాల్లో కూడా రోబోటిక్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని పాఠశాల విద్య నుంచే రోబోటిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వాటిలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రోబోటిక్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు వారి తల్లిదండ్రులు చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు రజినీకాంత్, రాజా, రామోజీరావు, ప్రిన్సిపల్ నటరాజ్, కోఆర్డినేటర్ శ్రీలత, సదానంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల అక్రమ అరెస్టుకు నిరసనగా ర్యాలీ

ఖిల్లా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న ఆశావర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆశవర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీఐటియూ ఆధ్వర్యంలో పీహెచ్‌సిల ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు సుకన్య, రేణుక, శోభనర్స, రేణుక సాహిర రేవతి పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరుతున్నామన్నారు. అయితే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతుంటే ఈ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. తమ సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా నిరసన చేపడ్తుంటే వారిని పోలీసులు ఎక్కడికక్కడే అడుకుని అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో లావణ్యలక్ష్మి, సరిత, జరీనాసుల్తాన, వహిదా, విజయ, గీత తదితరులు పాల్గొన్నారు.

దేశ్‌పాండే ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మోపాల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్లంతో పాటు జీవన విలువలు నేర్పడం అభినందనీయమని గుండారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్ అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ ఇన్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు విలువలతో కూడిన జీవనం సాగించాలని అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దేశ్‌పాండే ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భానుప్రసాద్, రూపా, మౌనిక, సువర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ధర్పల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒన్నాజిపేట గ్రామానికి చెందిన నర్సయ్య (60) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. నర్సయ్య కొద్దిరోజులుగా కూతురుకు పెళ్లి కావడం లేదని, నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి తెచ్చిన అప్పులు ఎక్కువయ్యాయని తరచూ చెప్పుకుంటూ బాధపడేవాడని ఆయన పేర్కొన్నారు. ఈ బాధలు భరించలేక సోమవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి రెండు రోజుల జైలు

సిరికొండ మార్చి 25 (ఆంధ్రజ్యోతి) బహిరంగంగా మద్యం సేవించిన వారికి ఆర్మూర్ మెజిస్ట్రేట్ రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు సిరికొండ ఎస్సై ఎల్ .రామ్ తెలిపారు.సిరికొండ మండలంలోని బహిరంగంగా మద్యం తాగుతూ పట్టుబడిన ఏడుగురు వ్యక్తులను ఆర్మూర్ కోర్టులోమంగళ వారం ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ వారికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై తెలపారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nirmal Branch, Dist. Nirmal agreed to accord Loan to Mada Gangadher S/o Mada Narsimloo, Aged 56 Yrs, Occ:Business, R/o H.No.8-68, Aloor (V) Armoor (M), Nizamabad (Dist) mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within 5 days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed futher for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE OF THE PROPERTY

R.C.C Roofed House bearing G.P.No.8-68, admeasuring total site area 2612.25 Sq.ft or 290.25 Sq.Yds, or 242.67 Sq.mts, and R.C.C Roofed Built-up area 897.00 Sq.ft, situated at Aloor village of Armoor Mandal, Gram Panchayath Aloor, Mandal Parishad:Armoor, District and Zilla Parishad Nizamabad, Registration District Nizamabad and Registration Sub-District: Armoor.

Boundaries as follows

East : 21'-0" wide Road, **West :** House belongs to Narsavva, **North:** 24'-0" wide G.P. Road **South:** House belongs to Gundla Gangaram,

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

SUMMONS FOR SETTLEMENT FOR ISSUES (OR.V R.1 AND 5 C.P.C.)
IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE AT BODHAN
O.S.NO. 44 OF 2024

Between:
M/S GODAVARI URBANBANKMULTI STATE CERDIT COP SOCITY BODHAN ...Plaintiffs
AND
SRI.KASALA ANIL KUMAR & OTHERS ....Defendants
FULL DESCRIPTION OF THE PLAINTIFFS:
To:-sri. Kasala Anil Kumar S/oGopal Krishna Goud Age: 35 years Occ: Business R/o. H.No. 5-5-114/B Chaithanya colony Banswada cell: 8885766007
Dist: Nizamabad
The Defendant No.1 namely

Whereas the above named Plaintiffs have filed suit against you for Recovery of mount. That several times summons/notices send to you but it was returned un served therefore Hon'ble court pleased to order substitute service of summons by way of publication. The case is posted on the 24-4-2025 at 10-30 A.M. in the forenoon to answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defense.

1. You are also directed to the your written statement within 30 days from the date of receipt of the summons.

2. Take notice that in default of your appearance on the day before mentioned and failing to file your written statement within 30 days, the suit will be heard and determined in your absence

// By order of the Court //
K.VIDYASAGAR, Advocate,Bodhan.

IN THE COURTOF HON'BLE ADDL.JUNIOR CIVIL JUDGE AT BODHAN
O.S.No.73 of 2024

Between:
1) Smt. Naseef Begum & Others ...Plaintiffs
AND
1) Zonal manager Telangana State Infrastructure Corporation Ltd,
2.).To whom so ever it may concern ....Defendants
FULL DESCRIPTION OF THE PLAINTIFFS:
1). Smt. Naseef Begum W/o.Late Mohammed Sarvar, Jilani
2). Mahammed Faran S/o late Mohammed Sarvar, Jilani
3).Mohammed Toufeeq S/o. late Mohammed Sarver, Jilani
4). Mohammed Faizaan S/o. Late Mohammed Sarver Jilani
,R/o H.No 1-4-1015 Goshala Gally BodhanDist Nizamabad

:: TO WHO SO EVER IT MAY CONCERN

Please take notice, in the above said OS No73 /2024 Suit to declare the plaintiff as legal heirs of deceased had entered into Agreement of Sale of Plot on 31-3-2007 with the defendant no.1 corporation for purchase of plot no.268 measuring 200.sq.mts situated at Auto nagar, Bodhan. As such, the said Mohammed Sarver Jilani purchased the above plot from the defendant and paid the entire amount and the deft.no.1 registered the said document no.5275/2007. There after, he also started his own Mohammed Sarver Jilani Pancher works shop under the name and style of Mohammed Sarver JilaniPanchar works shop. The Gram pancayat, Achanpally allotted house no.5-42 to the said shed.The Gram pancayat, The same is allotted by the defendant. Before execute the sale deed in his favour he died.

Therefore, the above case is posted on 03-04-2025 before this Court and if anybody has got any objection to be made before ADDL J.F.C.M. Court Bodhan on 03-04-2025 at 10.30 a.m. failing which the matter will be decided in favour of the plaintiff.

// By order of the Court //
K.VIDYASAGAR, Advocate,Bodhan.

IN THE COURTOF HON'BLE JUNIOR CIVIL JUDGE AT BODHAN
O.S.NO.177 OF 2024

Between:
1).Smt.1.SMT.NAJAMA BEGM&Other ...Plaintiffs
AND
1).Zonal manager Telangana State Infrastructure Corporation Ltd,
2.).To whom so ever it may concern ....Defendants
FULL DESCRIPTION OF THE PLAINTIFFS:
1.SMT.NAJAMA BEGM W/o SYED AZEEM.
2.SRI.SYED IMRAN S/O. SYED AZEEM
3.SRI. IRFAN S/O. SYED AZEEM
4.Smt. ANJUM KOUSER D/O.SYED AZEEM
5. NEHA FATIMA D/O. SYED AZEEM
R/o. 1-1-342/23 Rakasipet Bodhan

:: TO WHO SO EVER IT MAY CONCERN

Please take notice, in the above said OS No177 /2024 Suit to declare the plaintiff as legal heirs of deceased had entered into Agreement of Sale of Plot on 24-3-2004 with the defendant no.1 corporation for purchase of plot no.71 measuring 300.sq.mts situated at Auto nagar, Bodhan. As such, the said Abdul Jaleel purchased the above plot from the defendant and paid the entire amount and the deft.no.1 registered the said document no.1577/2004. There after, he also started his own Syed Azeem Lorry mechanic works shop under the name and style of Syed Azeem Lorry mechanic works shop. The Gram panchayat, Achanpally allotted house no.4-26 to the said shed.The Gram panchayat, The same is allotted by the defendant. Before execute the sale deed in his favour he died.

Therefore, the above case is posted on 26 -3-2025 before this Court and if anybody has got any objection to be made before JUNIOR CIVIL JUDGE Court Bodhan on26 -3-2024 at 10.30 a.m. failing which the matter will be decided in favour of the plaintiff.

// By order of the Court //
K.VIDYASAGAR, Advocate,Bodhan.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
M.G. రోడ్ బ్రాంచ్ (20110), ఆర్మూర్, జిల్లా : నిజామాబాద్

డిమాండ్ ప్రకటన

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద)

దిగువ తెలిపిన రుణగ్రహీతలైన **మెసర్స్ జనతా బిల్డర్, యజమాని శ్రీ మహ్మద్ అబ్దుల్ ఖయ్యుం, తండ్రి గులామ్ హుస్సేన్** బ్యాంకు నుండి పొందిన రుణ సౌకర్యాల మొత్తం మరియు వడ్డీ తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారని మరియు సదరు రుణాలు నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ (NPA) గా వర్గీకరించబడినవని ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద వారి చివరిగా తెలిసిన చిరునామాలకు నోటీసులు జారీచేయబడినవి. కాని, అవి అందజేయకుండా తిరిగి వచ్చినవి మరియు అందువలన వారికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది

రుణగ్రహీత/ హామీదారు పేరు:	ఆస్తుల వివరాలు / జప్తుచేయవలసిన సెక్యూర్డ్ ఆస్తుల చిరునామా:	ప్రకటన తేది:	ఎన్‌పిఎ తేది:	బకాయి మొత్తం (ప్రకటన తేదీ నాటికి)
మెసర్స్ జనతా బిల్డర్, యజమాని శ్రీ మహ్మద్ అబ్దుల్ ఖయ్యుం, తండ్రి గులామ్ హుస్సేన్, చిరునామా: 1) ఇ.నం. 4-100/5, మామిడిపల్లి, ఆర్మూరు, చిరునామా 2): ఇ.నం. 4-75 (కొత్త), 4-56/ 1/ఇ3 (పాత), మామిడిపల్లి, ఆర్మూరు, నిజామాబాద్ జిల్లా - 503224. ఖాతా నం. 39001624781	డాక్యుమెంట్ నం. 2140/2015 ప్రకారం శ్రీ మహ్మద్ అబ్దుల్ ఖయ్యుం, తండ్రి గులామ్ హుస్సేన్ కు చెందిన ఆర్మూరు రిజిస్ట్రేషన్ ఉప జిల్లా మరియు నిజామాబాద్ రిజిస్ట్రేషన్ జిల్లా, నిజామాబాద్ జిల్లా మరియు జిల్లా పరిషత్, ఆర్మూరు మండల పరిషత్, మామిడిపల్లి గ్రామ పంచాయితీ, ఆర్మూరు మండలం యొక్క మామిడిపల్లి గ్రామం వద్ద గల ఆర్‌సిసి రూఫ్ కలిగిన బిల్టప్ ఏరియా: 1665.00 చ.అడుగులు మరియు 70'-0"x55'-0"= 3850.00 చ.అడుగులు లేదా 427.77 చ.గజాలు లేదా 357.66 చ.మీటర్ల విస్తీర్ణ మొత్తం స్థలం, G.P.L.P నం.92/ఎ-94-95లో సర్వే నం.138లో లేఅవుట్ ప్లాట్ నం.లు: 30 మరియు 31లో నిర్మించబడిన జీపి నం.4-75 (కొత్త) మరియు 4-55/1/ఇ3 (పాత) గల ప్రస్తుత	27.02. 2025	13.02. 2025	27.02.2025 నాటికి రూ.31,50,533/- (రూపాయలు ముప్పై ఒక్క లక్షల యాభై వేల ఐదు వందల ముప్పై మూడు మాత్రమే) + వడ్డీ + చార్జీలు

ఆర్‌సిసి రూఫ్ కలిగిన నివాసిత ఇల్లు యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 24 మరియు ప్లాట్ నం.23, దక్షిణం: ప్లాట్ నం.29 మరియు ప్లాట్ నం.28, తూర్పు: 30'-0" వెడల్పు రోడ్, పశ్చిమం: షేక్ మహ్మద్ ప్లాట్ నం.25 మరియు 26లో ఇ.నం.4-76.

ప్రత్యామ్నాయ ప్రకటన అందజేయడానికి చర్యలు తీసుకోబడుచున్నవి. ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించాలని పైన తెలిపిన రుణగ్రహీత(లు) / మరియు / లేదా వారి హామీదారు(ల)ను ఇందుమూలంగా కోరడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (4) క్రింద ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజుల తరువాత తదుపరి చర్యలు తీసుకోబడును.

తేది: 27.02.2025
ప్రదేశం : ఆర్మూరు
సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.90,500	రూ.83,500	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00, 4.45, 10.45)
: అనగనగా ఆస్ట్రేలియాలో (1.20)
: షన్ముఖ (8.05)
స్క్రీన్-2 : కోర్టు (10.05, 4.30, 7.35, 10.40)
: చావా (హిందీ) (1.10)
స్క్రీన్-3 : కిస్ కిస్ కిస్సిక్ (11.00, 7.30)
: షన్ముఖ (1.50)
: ఆర్టిస్ట్ (4.30, 10.20)
స్క్రీన్-4 : సలార్ (10.20, 4.25, 10.30)
: పెళ్లికాని ప్రసాద్ (1.50, 7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కోర్టు (1.40, 7.30, 10.30)
: ఆర్టిస్ట్ (4.35)
స్క్రీన్-2 : ఎవడే సుబ్రహ్మణ్యం (10.50, 4.30, 10.35)
: పెళ్లికాని ప్రసాద్ (1.40, 7.30)
స్క్రీన్-3 : ఎవడే సుబ్రహ్మణ్యం (1.30)
: ఆర్టిస్ట్ (7.30)
: సలార్ (10.20)

లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)
దేవి: పెళ్లికాని ప్రసాద్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : షన్ముఖ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సలార్ (11.15, 2.15, 6.15, 9.15)